క్లుప్తంగా

అర్హులందరికీ ఇంటిపట్టాలు



పట్టాలను అందజేస్తున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి

గుడిపాల: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయనున్నట్లు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్‌తో కలిసి ఇంటి పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ డీబీ పల్లె రెవెన్యూలో గతంలో కొంతమందికి పట్టాలు రాకపోవడంతో వారిని గుర్తించి ఇప్పుడు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇంకా అర్హులుగా ఉన్నట్లయితే వారికీ ఇంటిపట్టాలను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువత అధ్యక్షుడు శిలంబరసన్, వీఆర్‌ఓలు గోపి, శంకరయ్య పాల్గొన్నారు.

తప్పులొస్తే బీఎల్‌ఓలదే బాధ్యత



కార్యాలయంలో మాట్లాడుతున్న శివయ్య

తవణంపల్లె: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరబాట్లు ఉన్నా, బీఎల్‌ఓలే బాధ్యత వహించాలని జిల్లా ఓటర్ల జాబితా పర్యవేక్షణాధికారి శివయ్య స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని నూతన ఓటర్ల నమోదు, తప్పుల సవరణలు, తొలగింపులు జాగ్రత్తగా సర్వే చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి, డీటీ నరేష్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటివద్దకే వైద్యం

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని బొమ్మసముద్రం వైద్యాధికారి అనూష అన్నారు. మండలంలోని రాసనపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇందులో 55 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య సిబ్బంది శిరీషా, అన్నపూర్ణ, సుప్రియ, మల్లిక పాల్గొన్నారు.

కట్టకిందపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: మండలంలోని కట్టకిందపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి వినయ్‌కుమార్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు సలహాలు ఇచ్చారు. అదే విధంగా గర్భవతులకు, బాలింతలకు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆలయ సిబ్బంది నిజాయితీ



మహిళకు నగను అందిస్తున్న అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శానిటేషన్ ఉద్యోగి తనకు దొరికిన బంగారు నగను అధికారులకు ఇచ్చి తన నిజాయితీని చాటుకుంది. శుక్రవారం సాయంత్రం ఆలయంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద బంగారు నగ కింద పడి ఉండడం గుర్తించిన శానిటేషన్ మహిళ వెంటనే ఆ బంగారు నగను ఆలయ సూపరింటిండెంట్‌కు అందించారు. అప్పటికే బంగారు నగ పోగొట్టుకున్న తిరుపతికి చెందిన భక్తురాలు లలితకు ఆలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే అధికారులు నగ పోగొట్టుకున్న మహిళకు అందించారు. శానిటేషన్ సిబ్బందిని వారు అభినందించారు.

రసాయన నీళ్లు తాగి ఆవు మృతి

చిత్తూరు అర్బన్: నగరంలోని రాములవారి గుడి సమీపంలో రసాయనాలు కలిసిన నీళ్లను తాగి ఆవుమృతి చెందింది. శుక్రవారం ఓ ఆవు రాములవారిగుడి సమీపంలో వస్తూ ఓ దుకాణం వద్ద ఉంచిన నీళ్లను తాగి అక్కడికక్కడే పడిపోయింది. స్థానికులు వచ్చి చూసేసరికి.. బంగారు ఆభరణాలు పాలిష్ చేసే రసాయనాలు కలిసిన నీళ్లు తాగి ఆవు చనిపోయినట్లు గుర్తించారు. దీంతో అక్కడే ఉన్న సంబంధిత దుకాణ యజమానికి చీవాట్లు పెట్టారు.

మద్యం సీజ్ : ఇద్దరి అరెస్ట్

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రేతలను చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బంగారుపాళ్యం వద్ద ఎస్‌ఈబీ పోలీసులు తనిఖీలు చేశారు. కేజీ సత్రం సమీపంలోని ఆరేటమ్మ కూడలి వద్ద బి.రవి (45), వరదరాజులు (47) ద్విచక్రవాహనంపై 384 టెట్రామద్యం ప్యాకెట్లను తీసుకెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు. బైక్‌తో సహా మద్యం ప్యాకెట్లను సీజ్ చేశారు. దాడుల్లో ఎస్‌ఐ మోహన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవనోపాధికి చేయూత

■ ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈమె పేరు మహనిర్ష. పూతలపట్టుకు చెందిన ఈమెకు 'వైఎస్సార్ చేయూత' పథకం కొండంత భరోసా కల్పించింది. అప్పటివరకు ఈ కుటుంబానికి అంతంత మాత్రపు ఆదాయం వచ్చేది. ఎప్పుడైతే రాష్ట్ర ప్రభుత్వం 'చేయూత' పథకంతోపాటు బ్యాంకుల ద్వారా సహకారం అందించిందో మహనిర్ష దశ తిరిగింది. ఆ డబ్బుతో ఊర్లోనే చిల్లర దుకాణం ప్రారంభించింది. ప్రస్తుతం రోజూ రూ.3 వేలకు తగ్గకుండా వ్యాపారం సాగుతోంది. జగనన్న పుణ్యమా అని మా కుటుంబం ఇప్పుడు ఎవరిపై ఆధారపడకుండా ఎదుగుతున్నామంటూ ఆమె సంతోషాన్ని వ్యక్తం చేసింది.



కిరాణా కొట్టు నడుపుకుంటున్న మహనిర్ష

- అక్కచెల్లెమ్మల జీవితాల్లో వెలుగులు
- రాష్ట్ర ప్రభుత్వం అందించిన చేయూత
- మూడు విడతల్లో రూ.10.45 కోట్ల మంజూరు

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుంటున్న మహిళలు ఆర్థికంగా దూసుకుపోతున్నారు. కూలి పనులపై ఆధారపడి జీవనం సాగిస్తూ తగిన ఆదాయం లేక సతమతమవుతున్న కుటుంబాలు సైతం ఇప్పుడిప్పుడే ప్రభుత్వ సాయంతో నిలదొక్కుకుంటున్నాయి. ప్రధానంగా 'వైఎస్సార్ చేయూత' వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ఈ పథకం కింద ఒక్కో మహిళకు ఏడాదికి రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో రూ.75వేలు ఆర్థికసాయం అందించింది. మండలంలో 1071 పొదుపు సంఘాలు, 11,331 మంది సభ్యులు ఉన్నారు. వైఎస్సార్ ఆసరా కింద 919 పొదుపు సంఘాలకు 8462 మందికి మూడు విడతల్లో రూ.26.80 కోట్లను ప్రభుత్వం అందజేసింది. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 5723 మందికి రూ.10.45 కోట్ల లబ్ధిని చేకూర్చింది. వీటితో పాటు ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, సున్నా వడ్డీలతో కలిపి మొత్తంగా రూ.47.68కోట్ల మేర మహిళలు లబ్ధి పొందారు.

విరివిగా రుణాలు

మండలంలోని మహిళలు ఎవరిపైనా ఆధారపడకుండా ప్రభుత్వం అందిస్తున్న చేయూతతోపాటు డ్వాక్రాలో రుణాలు అందుకొని, కిరాణాషాపు, కోళ్ల పెంపకం, టైలర్ షాపు, పశువుల పెంపకం, హోటళ్ల వంటి వ్యాపారాలతో వారి జీవనశైలిని మెరుగుపెంచుకుంటున్నారు. దీంతో మహిళలకు ప్రభుత్వంపై మరింత నమ్మకం చేకూరింది. గతంలో పొదుపు సంఘాల మహిళలకు రూ.2 లక్షలు, రూ.3 లక్షలు కూడా రుణాలు అందని పరిస్థితి. ఇప్పుడు మహిళలు వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ ద్వారా విరివిగా రుణాలందుతున్నాయి. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు డ్వాక్రా రుణమాఫీ హామీని నిలబెట్టుకోకుండా మోసం చేయడంతో మహిళా సంఘాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. ఇప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన చేయూతతో మహిళలు సకాలంలో బ్యాంకులో రుణాలను చెల్లిస్తూ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారు.

వివిధ పథకాల ద్వారా మండలంలో మహిళలు లబ్ధిపొందిన మొత్తం (కోట్లలో)

పథకాలు	మొదటి విడత	రెండవ విడత	మూడవ విడత	నాలుగో విడత	మొత్తం
వైఎస్సార్ చేయూత	3.13	3.34	3.98	-	10.45
కాపు నేస్తం	0.26	0.28	0.27	0.28	1.10
ఈబీసీ నేస్తం	1.78	1.87	-	-	1.65
ఆసరా	8.93	8.94	8.93	-	26.8
సున్నావడ్డీ	2.67	1.97	2.04	1.40	47.68

కిరాణా కొట్టు పెట్టుకున్నా



నాకు కిరాణాకొట్టు పెట్టుకోవాలని ఉన్నా, సాయం అందించే వాళ్లు లేక ఇప్పటివరకు పెట్టుకోలేదు. జగనన్న మా కష్టాలను గుర్తించి ప్రతి ఏటా వైఎస్సార్ చేయూత పథకంలో భాగంగా రూ.18,750 అందిస్తున్నారు. వాటితో పాటు బ్యాంకు నుంచి రుణం తీసుకొని కిరాణా కొట్టు పెట్టుకున్నాను. ఎవరిపై ఆధారపడకుండా నా కష్టార్జితంతో బతుకుతున్నానంటే దీనికి కారణం జగనన్నే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

\- పి.మల్లిక, బి.రామాపురం, పూతలపట్టు.

మహిళా వ్యాపారవేత్తలుగా..



రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ చేయూత పథకంతో మండలంలోని మహిళలు ఆర్థికంగా బలపడుతూ, బ్యాంక్‌లో రుణాలు తీసుకొని వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారు. గతంలో రుణాలు తీసుకుంటే సరిగా చెల్లించలేని పరిస్థితి ఉండేది. వైఎస్సార్ చేయూత పథకంతో మహిళలకు ఆర్థిక బలం చేకూరింది. పొదుపు సంఘాల మహిళలు సమయానికి చెల్లింపులు సక్రమంగా చేస్తున్న మూలంగా రుణాలు పొందుతున్నారు. ఆర్థికంగా ఎదుగుతున్నారు.

\- నాగరత్న, ఏపీఎం, పూతలపట్టు

ప్రభుత్వ ఆదేశాల మేరకు..



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పొదుపు సంఘాల్లో అర్హత పొందిన మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు నేరుగా వారికి అందుతున్నాయి. వైఎస్సార్ చేయూత, ఆసరా, ఈబీసీ నేస్తం, కాపునేస్తం, సున్నావడ్డీ పథకాలతో మూడేళ్లలో 89.68 కోట్ల రూపాయలు లబ్ధిని ప్రభుత్వం మహిళలకు చేకూర్చింది. ప్రభుత్వం అందించే డబ్బును మహిళలు దుర్వినియోగం చేయకుండా వ్యాపారాల వైపు మక్కువ చూపారు. ఎవరిపై ఆధారపడకుండా వారి కాళ్లమీద నిలబడుతున్నారు.

\- గౌరి , ఎంపీడీఓ, పూతలపట్టు

రేపు కార్తీక దీపోత్సవం

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయానికి అనుబంధంగా ఉన్న దేవరకొండపై ఆదివారం కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజు తెలిపారు. దేవరకొండపై కొలువైన పార్వతీ సమేత శ్రీజలకంఠేశ్వరస్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం దేవరకొండపై గల బురుజుపై కార్తీక దీపాన్ని వెలిగించనున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని జలకంఠేశ్వర స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఆడుదాం..ఆంధ్రపై అవగాహన

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం సిద్ధంపల్లి పీపీఏజెడ్పీ పాఠశాలలో శుక్రవారం ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీలపై వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని 11వ వార్డు, చింతలగుంట, తాళంబేడులోని వలంటీర్లకు పీడీలు అవగాహన కల్పించారు. కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడలపై వివరించారు. కార్యక్రమంలో రవీంద్రరెడ్డి, బాలాజీ, సురేష్, ముత్తు తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్టాపన



ధ్వజస్తంభ పూజ చేస్తున్న అర్చకులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం ప్రశాంత్‌నగర్‌లో వెలసిన శ్రీ శాస్త్రగిరి అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్టాపనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఉదయం మూలస్థానంలోని స్వామి వారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం విశేష పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తర్వాత హోమ పూజలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్టాపనను పూర్తిచేశారు. సాయంత్రం ధ్వజారోహణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ధ్వజారోహణ కార్యక్రమం ఐదు రోజులపాటు ఉంటుందని తెలిపారు. ఆలయం డిసెంబర్ 28వ తేదీ వరకు తెరిచి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వాసుదేవా నంబుద్రి, సభ్యులు మహేష్, బాబు, రామ్మూర్తి, భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జెండా ధ్వంసంపై కేసు





ఉదయం: వైఎస్సార్‌సీపీ నేతలు ఆవిష్కరించిన జెండా, సాయంత్రం టీడీపీ నేతలు ధ్వంసం చేసిన దృశ్యం

యాదమరి: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించిన జెండాను టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన ఘటన మండలంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ మేరకు పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం.. మండలంలోని అతికారపల్లె పంచాయతీ, బొమ్మన్‌చేను గ్రామంలో శుక్రవారం సాయంత్రం జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, నాయకులు కలసి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బొమ్మన్ చేను గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించి సచివాలయ పరిధిలో లబ్ధిపొందిన వారి వివరాలు వెల్లడించారు. అందరూ వెళ్లిపోయిన తర్వాత టీడీపీ నాయకులు విజయేంద్రయాదవ్, వేణుయాదవ, నరసింహులు, శివ కలిసి వైఎస్సార్‌సీపీ జెండాను, దిమ్మెను ధ్వంసం చేశారు. అదే సమయంలో పోలీసులు అక్కడే ఉండి వారిని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, సీఐ రవిశంకర్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ పార్టీ జెండాను ధ్వంసం చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మునస్వామి తెలిపారు.

ప్రతిఘటించే పరిస్థితి తేవద్దు

ఇప్పటి వరకు మండల పరిధిలో టీడీపీ నాయకులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించలేదని, దురుద్దేశపూర్వకంగా వైఎస్సార్‌సీపీ జెండాలను ధ్వంసం చేస్తే ప్రతిఘటించాల్సి వస్తుందని, ఆ పరిస్థితి తెచ్చుకోవద్దని జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి హెచ్చరించారు.

లక్ష్యసాధనలో ముందుండాలి

యాదమరి: వైద్య సిబ్బంది లక్ష్య సాధనలో అందరికంటే ముందు ఉండాలని యాదమరి వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ కోరారు. యాదమరి ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం వైద్య సిబ్బందికి సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ శాఖాపరమైన నివేదికలు సకాలంలో పూర్తి చేసి జిల్లాలో యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీ నారాయణ, ఏఎన్‌ఎం పాల్గొన్నారు.

నియామకం

చిత్తూరు కార్పొరేషన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి ఆదేశాల మేరకు నియామకం చేపట్టినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నగరంలోని కట్టమంచి మండల అధ్యక్షులుగా పూర్ణచంద్ర, ప్రధాన కార్యదర్శిగా ఆదికేశవులు, ఉపాధ్యక్షులుగా వెంకటేష్‌ను నియమించారన్నారు.

సదస్సు వాయిదా

చిత్తూరు కార్పొరేషన్: ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్ అంశంపై ఆదివారం తిరుపతిలో నిర్వహించాల్సిన అవగాహన సదస్సు వాయిదా పడినట్లు విద్యుత్ ఓసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు శేషాద్రి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి సదస్సు నిర్వహించే తేదీ, స్థలం వివరాలను ప్రకటిస్తామని వివరించారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, పక్కన ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు కోరారు. కాణిపాక ఆలయ సమావేశపు మందిరంలో శుక్రవారం ఆలయ అధికారులకు, కాంట్రాక్టర్లకు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆలయ అభివృద్ధి చేస్తున్న పనులు, చేయాల్సిన పనులకు సంబంధించి మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో లడ్డూపోటు భవనం, వినాయక సదన్‌పై అదనపు గదుల నిర్మాణం, టాయిలెట్లు, తదితర పనులను త్వరగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కొత్త పనులకు టెండర్లు పిలిచి శంకుస్థాపనలు చేసి ప్రారంభించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ వెంకటనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కాంట్రాక్టర్ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో బంగారం చోరీ

పూతలపట్టు: పట్టపగలే ఇంట్లో బంగారం చోరీ జరిగిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాంభూపాల్ కథనం మేరకు, మండలంలోని కొండకిందపల్లెలో నివాసముండే చంద్రశేఖర్ నాయుడు గురువారం ఉదయం ఇంట్లోని వారు పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిపైకి ఎక్కి మిద్దెపై ఉన్న తలుపులను పగలకొట్టారు. అనంతరం ఇంట్లోకి చొరబడి బీరువాలోని 88 గ్రాముల బంగారం తస్కరించారు. సుమారు రూ.2.40 లక్షలు చేస్తుందని అంచనా. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్‌డీఎస్‌ఎస్ పనుల ప్రారంభం

చిత్తూరు కార్పొరేషన్: డివిజన్ పరిధిలో ఆర్‌డీఎస్‌ఎస్ (రీ వ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం) పనులు ప్రారంభమైనట్లు ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. ఆయన కార్యాలయంలో వివరాలను శుక్రవారం వెల్లడించారు. జీడీనెల్లూరు, కొత్తపల్లె, రెడ్డిగుంట సెక్షన్ల పనులు జరుగుతున్నాయన్నారు. వ్యవసాయానికి, ఇతర సర్వీసులకు వేర్వేరుగా ఫీడర్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. తుమ్మిందపాళెం సబ్‌స్టేషన్‌లో లైన్ పనులు జరుగుతుండగా, అనుపల్లె జగనన్న కాలనీలోని సబ్‌స్టేషన్ పనులు దాదాపు పూర్తయ్యాయని, త్వరలో వీటిని ప్రారంభిస్తామన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ సీఎం చేసుకుందాం

బంగారుపాళెం: పేదల సంక్షేమమే అజెండాగా సుపరిపాలన అందిస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని బోడబండ్ల గ్రామంలో శుక్రవారం సర్పంచ్ నిర్మల ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధి వివరాల బోర్డును ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, అవినీతికి ఆస్కారం లేకుండా కుల, మత, వర్గ, పార్టీ తేడా లేకుండా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు జరిగాయన్నారు. కాబట్టి మళ్లీ మన ఆంధ్రప్రదేశ్‌కి జగనే కావాలని చెప్పారు. గ్రామంలో కరపత్రాలను అందించి జగనన్న సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీషరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు హరి, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మొగిలీశ్వర, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, పార్టీనాయకులు, గృహ సారథులు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ దుర్గాప్రసాద్, గ్రామ కార్యదర్శి రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం అభివృద్ధి జగనన్నకే సాధ్యం

చిత్తూరు రూరల్: సంక్షేమం, అభివృద్ధి జగనన్నకే సాధ్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు మండలం పాలూరులో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత సంక్షేమ పథకాల బోర్డుతో పాటు జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచిస్తున్నారన్నారు. పేదల ఇంటికే సంక్షేమ వరాలు కురిపిస్తున్నారని చెప్పారు. అందుకే జగనన్నను మళ్లీ గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాము, మురుగ, వేలుస్వామి, జాన్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.





చిత్తూరు: జెండా ఆవిష్కరణలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, బంగారుపాళెం: సంక్షేమ పథకాల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

అర్హతే ప్రామాణికం

చిత్తూరు కార్పొరేషన్: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం బాలాజీనగర్‌లో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాయంలో సంక్షేమ పథకాల డిస్ ప్లే బోర్డును ప్రారంభించారు. కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర పార్టీ అధ్యక్షులు జ్ఞానజగదీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, నగర సచివాలయ కన్వీనర్లు రాంగణేష్, కిరణ్, కార్పొరేటర్ చల్లాముత్తు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంపూర్ణ అభివృద్ధి

తవణంపల్లె: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం సంపూర్ణంగా అభివృద్ధి చెందుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు సి.హరిరెడ్డి అన్నారు. మండలంలోని పైమాఘం సచివాలయంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ బోర్డును, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, పార్టీ నాయకులు కిషోర్ రెడ్డి, గాంధీబాబు, పరమేశ్వరరెడ్డి, పార్థసారథిరెడ్డి, సందీప్‌రెడ్డి, రవిరెడ్డి, ప్రశాంతకుమార్, మధుకుమార్, వలంటీర్లు, గృహసారథులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జగనన్నకు మద్దతు ఇవ్వాలి

యాదమరి: రాష్ట్రాని అభివృద్ధి చేసే నాయకుడు జగనన్నకు మనం అందరం మద్దతు ఇవ్వాలని జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మండలంలోని 14 కండ్రిగ ముస్లింవాడలో శుక్రవారం ప్రారంభించారు. సంక్షేమ బోర్డును ప్రారంభించారు. రాష్ట్ర మైనారిటీ నాయకులు కబీర్‌బాషా, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి,పాల్గొన్నారు.

అర్హులందరికీ లబ్ధి

పూతలపట్టు: ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా అర్హులందరికీ లబ్ధిని చేకూరుస్తోందని వైఎస్సార్ సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి అన్నారు. మండలంలోని అయ్యప్పగారిపల్లి సచివాలయ పరిధిలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాల లబ్ధి బోర్డును, జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, వైఎంపీపీ ద్వారకనాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు దొరస్వామిరెడ్డి, ఎంపీడీవో గౌరి, నాయకులు నిరంజన్‌రెడ్డి, షణ్ముగం, మణి, మల్లిరెడ్డి, బాబు, శివయ్య పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాం

గుడిపాల: ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చినట్లు వసంతాపురం సర్పంచ్ రజినీకాంత్ అన్నారు. శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు విశ్వనాధరెడ్డి, శ్రీరాములు, శిలంబరసన్,సుశేంద్రారెడ్డి,గుండుసాయి, గృహసారథులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాతకు అండగా నిలవాలి

ఐరాల: సంక్షేమ ప్రదాత జగనన్నకు ప్రజలు అండగా నిలవాలని మండల పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చినకాంపల్లె సచివాలయంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. మండల సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.









తవణంపల్లె: బోర్డును ప్రారంభిస్తున్న పార్టీ నాయకులు, యాదమరి: బోర్డును ప్రారంభిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, పూతలపట్టు: కరపత్రాల ఆవిష్కరణ, గుడిపాల: బుక్‌లెట్ అందజేస్తున్న రజనీకాంత్